క్లుప్తంగా

విద్యార్థులకు బస్ పాస్‌ల పంపిణీ


విద్యార్థులకు పాస్‌లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

కాకినాడ: కాకినాడ ఘాటీ సెంటర్‌లోని జీఎంసీ బాలయోగి ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు గురువారం ఆర్టీసీ బస్ పాస్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులకు జారీ చేసే పాస్‌లకు సంబంధించి ప్రాసెసింగ్ ఫీజును మెడికవర్ ఆస్పత్రి సమకూర్చింది. ఈ పాస్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ ప్రతినిధి ఎం.సుధాకరరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బీవీ నారాయణ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా కుమారి బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఎల్‌ఎన్ కుమారి

కాకినాడ రూరల్: కొత్త తహసీల్దార్‌గా ఎస్‌ఎల్‌ఎన్ కుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా పిఠాపురం నుంచి ఆమె కాకినాడ రూరల్‌కు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన తహసీల్దార్ కరపకు బదిలీపై వెళ్లారు.

పారిశుధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు


ఆరోగ్య పరీక్షల శిబిరంలో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది

కాకినాడ సిటీ: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా కాకినాడ నగరంలోని 8, 9, 12 సర్కిల్ పరిధుల్లో పని చేసే పారిశుధ్య సిబ్బందికి వ్యాక్సినేషన్, ఆరోగ్య పరీక్షల శిబిరాలను గురువారం నిర్వహించారు. కాకినాడ నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల, ఇతర కాలేజీల్లో సైబర్ స్వచ్ఛత కార్యక్రమాలు జరిగాయి. మొబైల్ ఫోన్లలో అన్‌వాంటెడ్ యాప్స్‌ను తొలగించారు. అలాగే పలు సచివాలయాల్లో, ఇతర కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారామస్వామి కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: స్వామి జన్మ నక్షత్రమైన పునర్వసు సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో గురువారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. జీలకర్ర బెల్లం, తలంబ్రాలు, మాంగల్యధారణ మహోత్సవం వంటి ఘట్టాలు కనులపండువగా జరిగాయి. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్	: దేవర పార్ట్-1
	దేవర పార్ట్-1
	దేవర పార్ట్-1
	దేవర పార్ట్-1
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్	: దేవర పార్ట్-1
	దేవర పార్ట్-1
	దేవర పార్ట్-1 .
	దేవర పార్ట్-1
లక్ష్మీ	: దేవర పార్ట్-1
సత్యగౌరి	: దేవర పార్ట్-1
తిరుమల	: దేవర పార్ట్-1
సీఅండ్‌సీ1	: దేవర పార్ట్-1
సీఅండ్‌సీ2	: దేవర పార్ట్-1
శ్రీప్రియ	: దేవర పార్ట్-1
పద్మప్రియ	: దేవర పార్ట్-1
సూర్య (వాకలపూడి)	: దేవర పార్ట్-1
సూర్య2	: దేవర పార్ట్-1

కూరల సంతలో చిక్కుల చింత

- సమస్యలకు నిలయంగా గాంధీనగర్ రైతు బజార్
- పశువులతో రైతులు, వినియోగదారులకు తప్పని అవస్థలు
- వాహనాల పార్కింగ్ ఓ పద్మవ్యూహమే..
- పట్టించుకోని అధికారులు


గాంధీనగర్ రైతు బజార్‌లో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు


నిరుపయోగంగా ఉన్న చేపల షెడ్డు

బోట్‌క్లబ్: గాంధీనగర్ రైతు బజార్‌లో ప్రస్తుతం 40 మందికి పైగా రైతులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ తాము పండించిన కూరగాయలు విక్రయిస్తుంటారు. నిత్యం వెయ్యి మందికి పైగా వినియోగదారులు ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. అటువంటి రైతు బజార్‌లో అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నా, అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేవు. నిత్యం రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇరుకు ప్రదేశంలో రైతులు కూరగాయలు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పార్కింగ్ తిప్పలు

రైతు బజార్‌కు వచ్చే వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని పరిస్థితి వినియోగదారుల్లో నెలకొంది. రైతు బజార్‌లో అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో, తరచూ వాహనాలు తీసుకునేందుకు వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. రైతు బజార్‌లోకి ఆటోలు, రిక్షాలు కూడా రావడంతో వినియోగదారులు తమ ద్విచక్ర వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. మొదట వచ్చిన వారు వాహనం పార్కింగ్ చేసి.. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళితే, దానికి అడ్డంగా వాహనాలు పెట్టేస్తున్నారు. దీంతో మొదట పార్కింగ్ చేసిన వాహనాలు బయటకు తీసే వీల్లేకుండా పోతోంది. దీంతో వాహన యజమాని వచ్చేంత వరకూ ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో రైతు బజార్ వద్ద ట్రాఫిక్ సిబ్బంది ఉండడంతో, ప్రజలు వాహనాలను రైతు బజార్ బయట పార్కింగ్ చేసేవారు. దీంతో వినియోగదారులకు ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో, ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు.

పశువులతో ఇబ్బందులు

గాంధీనగర్ రైతుబజార్‌లో వేళాపాళాలేకుండా పశువులు సంచరిస్తుండడంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాడైన కూరగాయలను రైతు బజార్ ఆవరణలో రైతులు పారేస్తున్నారు. వీటిని కార్పొరేషన్ సిబ్బంది ప్రతీరోజు తీయకపోవడంతో, ఆవులు, ఇతర పశువులు రైతు బజార్‌లోకి చొరబడుతున్నాయి. కూరగాయల సంచిని వినియోగదారులు తమ ద్విచక్ర వాహనానికి పెడితే, వాటిని కూడా పశువులు తినేస్తున్నాయి. ఒకవైపు కూరగాయలు విక్రయిస్తుంటే, పశువులు రైతు బజార్‌లోకి వచ్చి చాటుగా కూరగాయలు తినేస్తుండడంతో తాము నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి రైతు బజార్‌లోకి పశువులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

ఖాళీ స్థలం రైతులకు ఇవ్వాలి

రైతు బజార్ ప్రాంగణంలో ఉన్న చేపలు విక్రయించే స్థలం గత పదేళ్లుగా ఖాళీగా ఉంది. ఇక్కడ చేపలు విక్రయించేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో, మత్స్యకారులు ఇక్కడ చేపల విక్రయాలు మానేశారు. దీంతో ఈ స్థలం నిరుపయోగంగా ఉంది. కార్పొరేషన్ అధికారులు ఇక్కడ చేపలు విక్రయించేందుకు సదుపాయాలైనా కల్పించాలని, లేకుంటే రైతులకైనా ఇస్తే మరింత మంది రైతులు కూరగాయలు విక్రయించుకునేందుకు వీలుంటుంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి



రైతు బజార్‌కు వారానికి ఒకసారి తప్పనిసరిగా వస్తాను. ఇక్కడ వాహనం ఎక్కడ పెట్టాలో తెలియడం లేదు. ఇరుకుగా ఉన్న రహదారుల్లో సైతం వాహనాలు పెడుతున్నారు. పార్కుకు ఉన్న రెండు వైపుల ద్వారాల్లో ఇదే పరిస్థితి ఉంటుంది. ఇక ఆదివారం కూరగాయలకు వెళితే, వాహనం ఎక్కడ పార్కింగ్ చేయాలో పాలుపోని పరిస్థితి ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకుని, వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– అజయ్‌కుమార్, వినియోగదారుడు

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి


క్రీడాకారులకు మొక్కలను అందిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రమణయ్యపేటలో అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల పర్యావరణం స్వచ్ఛంగా ఉంటేనే, మన ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. భూమి, జల కాలుష్యాల వంటి అనేక పర్యావరణ కారకాలు మానవ ప్రవర్తన, ప్రకృతి దోపిడీ ఫలితమే కావచ్చన్నారు. ఆరోగ్యకర వాతావరణ ప్రాముఖ్యాన్ని గుర్తెరగడం చాలా ముఖ్యమన్నారు. అందరూ పర్యావరణ పరిరక్షణ కోసం సమైక్యంగా కృషి చేయడం ద్వారా ప్రపంచాన్ని కాపాడుకోవచ్చన్నారు. రాబోయే తరాలను మంచి ఆకృతిలో ఉంచగలమన్నారు. అనంతరం క్రీడాకారులకు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, చైతన్య, కిరణ్, కిషన్, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై గ్రామ సర్వేయర్ల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామ సర్వేయర్లు

కాకినాడ సిటీ: ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండా ఆకస్మాత్తుగా 30 మంది కాకినాడ జిల్లా గ్రామ సర్వేయర్లను కోనసీమ జిల్లాకు బదిలీ చేయడంపై గ్రామ సర్వేయర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తమకు న్యాయం చేయాలని కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి సర్వేయర్లు కోరారు. ఈ సందర్భంగా సర్వే ఉద్యోగుల సంఘం కాకినాడ జిల్లా కార్యదర్శి వి.సురేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏటా ప్రభుత్వ ఉద్యోగులకు చేసే బదిలీల నేపథ్యంలో ఈ ఏడాది కూడా ఆగస్టు 8న ప్రభుత్వం వివిధ శాఖలకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో పలు దఫాలుగా దరఖాస్తుల ఆహ్వానం, కౌన్సెలింగ్ వంటి ప్రక్రియలు జరిగాయన్నారు. బదిలీ అయిన ఉద్యోగులు వారికి కేటాయించిన స్థానాల్లో చేరడానికి ఈ నెల ఒకటో తేదీని నిర్ణయించారన్నారు. అనంతరం ప్రభుత్వం మళ్లీ బదిలీలకు ఈ నెల 22గా నిర్ణయించిందన్నారు. 22న కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విలేజ్ సర్వేయర్ల కేటగిరీలో భారీగా ఖాళీలున్నట్లు గుర్తించారన్నారు. ఈ ఖాళీల భర్తీకి కొన్ని ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే ముందస్తు సమాచారం లేకుండా కాకినాడ జిల్లాలోని 20 మండలాల నుంచి 30 మంది గ్రామ సర్వేయర్లను బదిలీ చేయడంతో వారు మనోవేదనకు గురవుతున్నారని వివరించారు. తమకు న్యాయం చేయాలంటూ జేసీ రాహుల్ మీనాకు వినతిపత్రం అందించారు.

కలెక్టర్ పునః పరిశీలించాలని డిమాండ్

పునః పరిశీలించాలి

కాకినాడ జిల్లా నుంచి హఠాత్తుగా 30 మంది సర్వేయర్లను కోనసీమ జిల్లాకు బదిలీ చేసిన ఉత్తర్వులను కలెక్టర్ పునః పరిశీలించాలని సీఐటీయూ నేతలు గురువారం ఒక ప్రకటనలో కోరారు. కోనసీమ జిల్లాకు గ్రామ సర్వేయర్ల కొరత ఉంటే, ఆ జిల్లా నుంచి 12 మందిని కాకినాడ జిల్లాకు ఎలా బదిలీ ఉత్తర్వులు ఇచ్చారో చెప్పాలని సంఘ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. కొన్ని రోజుల క్రితం మ్యూచువల్ బదిలీ ఉత్తర్వులు ఇచ్చి, వారి పేర్లు కూడా తాజా బదిలీ ఉత్తర్వుల్లో ఉండడం శోచనీయమన్నారు. మరో మూడు నెలల్లో గ్రామ సర్వేయర్ల సర్వీసు ఐదేళ్లు పూర్తవుతుందని, అప్పుడు కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు నిర్వహిస్తే సమంజసంగా ఉంటుందన్నారు.

పర్యావరణ నిర్లక్ష్యం హానికరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుదాస్

కాకినాడ రూరల్: ఇంటి పరిసరాలు మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తాయని ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి ఫార్మసిస్ట్ ముఖ్య అధికారి ఎస్.ప్రభుదాస్ అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక రమణయ్యపేటలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణం–ఆరోగ్యం మధ్య పరస్పర సంబంధంపై అవగాహన పెంచడం ఈ దినోత్సవ లక్ష్యమన్నారు. పర్యావరణం, గాలి, నీరు, ఆహార నిర్లక్ష్యాలే వ్యాధులకు కారణమన్నారు. తాగే నీరు, వాయు కాలుష్యం, ఆహార భద్రత లేమి, వ్యర్థాల నిర్వహణ వంటి సమస్యలను పరిష్కరించడం ప్రజారోగ్యానికి చాలా ముఖ్యమని చెప్పారు. ఇందుకోసం కాలుష్యాన్ని నివారించాలని, చెట్లను అధికంగా పెంచాలన్నారు. స్వచ్ఛమైన గాలిని పీల్చాలని, వాహనాల ఉద్గారాలను నియంత్రించాలని సూచించారు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించి, పర్యావరణాన్ని పెంపొందించాలని కోరారు. పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ డ్యూటీ విడుదలకు వినతి


మేజర్ పంచాయతీలకు స్టాంప్ డ్యూటీ జమ చేయాలని ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాకినాడ రూరల్: మండలంలోని పలు మేజర్ గ్రామ పంచాయతీలకు స్టాంప్ డ్యూటీ జమ కాకుండా నిలిచిపోయాయని, అవి విడుదలయ్యేందుకు కృషి చేయాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు పలువురు నాయకులు విన్నవించారు. రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, నాయకులు చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు గురువారం ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. కాకినాడ రూరల్‌లోని రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ తదితర గ్రామాలకు ఆర్థిక సంఘ నిధులు జమ కావడం లేదని వారు వివరించారు. ఆయా విషయాలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఆయా పంచాయతీలకు న్యాయం చేయాలని కోరారు.

తూరంగిలో ఉచిత వైద్య శిబిరం


శిబిరంలో మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

బోట్‌క్లబ్: బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరెన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు వీఎస్‌ఎన్ మూర్తి అన్నారు. స్థానిక తూరంగిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ట్రస్ట్ వ్యవస్థాపకులు బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ, ఇటీవల ఢిల్లీకి చెందిన ఇండియా సీఎస్ఆర్ సస్టైన్‌బులిటీ సంస్థ తమ ట్రస్ట్‌కు బెస్ట్ కమ్యూనిటీ అవార్డును అందించినట్లు చెప్పారు. ఈ అవార్డు ట్రస్ట్ బాధ్యతలను మరెంత పెంచిందన్నారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్, దృష్టి ఐకేర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 600 మందిని పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు భారతీ, శాంతి, ఏడుకొండలు, తాతారావు, వి.మల్లికార్జునరావు, ఆర్‌జీ రామారావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చగా, ఆరుగురికి రెండు రోజుల వంతున జైలు, మరో ఆరుగురికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వచ్చే సమయం	వెళ్లే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.03
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10

అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా తూరంగి

జయప్రకాష్ నారాయణ సంక్షేమ సంఘ నేతలు


వివరాలు తెలుపుతున్న సంఘ సభ్యులు

కాకినాడ సిటీ: నిత్యం వందలాది మంది మహిళలు, వృద్ధులు, యువకులు వాకింగ్ చేస్తున్న బొడ్డు చెరువు ప్రాంతంలో రేయింబవళ్లు గంజాయి, డ్రగ్స్, మద్యం సేవిస్తూ తూరంగిని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుస్తున్నారని జయప్రకాష్ నారాయణ సంక్షేమ సంఘ అధ్యక్షుడు జోగా అప్పారావు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం కిమ్మనకపోవడంతో మరింత రెచ్చిపోతున్నారని చెప్పారు. గురువారం ఆయన తూరంగి బొడ్డు చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తూరంగిలో గత నాలుగేళ్లగా మద్యం, గంజాయి, డ్రగ్స్, కేసులు పెరగడంతో, ఇళ్లలో దొంగతనాలు విపరీతంగా పెరిగి ప్రజలు ప్రశాంతంగా జీవించలేకపోతున్నారన్నారు. వివిధ విద్యాసంస్థలకు నిలయమైన ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. తూరంగి శ్మశానం చుట్టూ డ్రగ్స్ బ్యాచ్‌లు తెల్లవార్లూ మద్యం సేవిస్తూ, స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు టి స్వామినాయకర్ మాట్లాడుతూ, జయప్రకాష్‌నగర్‌లో ఏడాది కాలంలో ఆరు దొంగతనాలు జరిగాయన్నారు. తూరంగి గ్రామాన్ని అసాంఘిక శక్తుల నుంచి కాపాడి, ప్రశాంత వాతావరణం కల్పించేలా పోలీసులు, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు డి.నాగబాబు, నందికోళ్ల రమేష్, కాళ్ల గోపాలస్వామి, బంగారం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలను తీర్చేందుకు సిద్ధం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కాకినాడ సిటీ: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజావసరాలను తీర్చేందుకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక 30, 35, 36, 37, 38, 39, 40 డివిజన్లకు సంబంధించి ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమాన్ని గురువారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వెనుక విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మనోహర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ: వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తూరంగి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని రవీంద్ర నగర్, గాంధీ ఎన్‌క్లేవ్, గాయత్రి స్కూల్ రోడ్డు, ఖాదీ భండారు రోడ్డు, కోటిపల్లి రోడ్డు, భాస్కర గార్డెన్స్, సూర్యానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అటంకం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

కాకినాడ రూరల్: వార్షిక మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాకినాడ డి–4 సెక్షన్ 33/11 కేవీ సర్పవరం విద్యుత్ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ, శ్రీచైతన్య స్కూల్ ఏరియా, ఇందిరా కాలనీ, కూరగాయల మార్కెట్, కాపుల రామాలయం, ఆర్టీసీ కాలనీ, శారదా నగర్, వైద్య నగర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అటంకం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

మెటీరియల్ రంగాన్ని శాసిస్తున్న సిలికాన్, జెర్మేనియం


వర్క్‌షాపులో మాట్లాడుతున్న రెక్టార్ కేవీ రమణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సాంకేతిక పరంగా మెటీరియల్ రంగంలో సిలికాన్, జెర్మేనియం శాసిస్తున్నాయని జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణ అన్నారు. జేఎన్‌టీయూకే మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ ఇన్ మెటీరియల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ అంశంపై గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ భారతీయ భాషలకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ప్రాంతీయ భాషల్లో ఏఐసీటీఈ సహకారంతో వర్క్‌షాపులు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధ్యాపకులకు, రీసెర్చ్ స్కాలర్లకు, విద్యార్థులకు ఉపయోగపడేలా వర్క్‌షాపులు నిర్వహించాలన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు మెటీరియల్ రంగంలో అనేక అప్లికేషన్లు రూపొందించేందుకు అవకాశం ఉందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహనరావు, డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ సాయికుమార్, మెకానికల్ విభాగాధిపతి లింగరాజు, కో–ఆర్డినేటర్ కల్యాణ్ మనోహర్ పాల్గొన్నారు.

మిల్లర్ల సంక్షేమానికి కృషి

ఎంపీ, ఎమ్మెల్యేలు తంగెళ్ల, రాజప్ప


రామకృష్ణను సత్కరిస్తున్న ఎంపీ ఉదయ్, ఎమ్మెల్యే రాజప్ప

కాకినాడ: రైసుమిల్లర్ల సంక్షేమానికి అన్నివిధాలా సహకరిస్తామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. రైసుమిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వల్లూరి సూర్యప్రకాశరావు(సూరిబాబు) అభినందన సభ గురువారం కాకినాడ జిల్లా సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మిల్లర్లకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మిల్లర్లు పలు సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేసన్ అధ్యక్షుడు నున్న రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు తుమ్మల బాబు, రాష్ట్ర రైసు మిల్లర్ల సంఘ కోశాధికారి నాయుడుతో పాటు, పలువురు మిల్లర్లు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

no traced Certificate [illegible]

[illegible]

పి.రమాకాంత్, అడ్వకేట్
డో.నెం. 64-12-14, రాజానగర్ కాలనీ, [illegible], కాకినాడ.
కాకినాడ. [illegible]
ది. 26.09.2024. [illegible] 15992